"సరేలే, మా బాచిగాడు సన్నాయూత్తాడు. మా బుల్లిచెల్లీ పెద్దచెల్లీ బాజాలు వాయిస్తారు. నేను సామానంతా తీసుకొస్తాను. మీరు ముందు నడవండి."

"గొడవచెయ్యకండ్రా మా మామయ్య చూస్తే చదువుకోలేదని తిడతాడు. ఏమే చిట్టీ, మీ నాన్నెక్కడున్నాడు?"

"భయం లేదురా, నిద్దరోతున్నాడు."

"లేస్తే తిడతాడు. మాట్లాడకుండా వరండాలోకి పోదాం."

"మీ రిద్దరూ యిల్లా పీటమీద కూర్చోండి. వాళ్లకి పసుపురాసి పారాణెడతాను.

"ఉత్తుత్తి పారాణేనామరి? నిజంగా ఐతేనే రాయించుకోను."

"అబ్బే. ఉత్తిదేరా."

"నువ్వీ పుస్తిలు పెళ్లికూతురు మెళ్లో కట్టు. బాజాలు వాయించండ్రా."

"తరంబ్రాలో మరి?"

"మా అమ్మనడిగి బియ్యం పట్రానా?"

"వద్దుబాబూ తిడుతుంది. ఉత్తుత్తివి పోసుకుందాం."

"పోనీ, అటుకులెట్టిపోసుకోండ్రా. తరవాత అవన్నీ తినేసి ఊరేగుదాం."

"అల్లా చేద్దామే చిట్టీ."

"అబ్బా! మాడవో కాంతం, తిరంబ్రాలోస్తూ నెత్తిమీద మొట్టుతున్నాడు."

"తిన్నగా పొయ్యరా సుందరం. నువ్వు మళ్లీ మొట్టవే."

"మావయ్యొస్తున్నాడే చిట్టీ."

"అదేమిట్రా. అటుకులల్లా పారపోసుకుంటున్నారు?"

"ఏమీలేదు నాన్నా, ఆడుకుంటున్నాం."

"ఆ నెత్తినిండా అటుకులేమిటి? తరంబ్రాలేమిటి?"

"మా చిట్టికి సుందరానికి పెళ్లండి."

"అప్పుడే పుస్తికట్టేసేవేమిట్రా."

"..............."

"మేం ఆడుకుంటూవుంటే మధ్య నువ్వేమిటి నాన్నా?"

"ఏం ఆడుతున్నావు."

"మీ సుందరాన్ని పెళ్లాడుతోందండి."

3

"మా మేష్టారు వుత్తరంరాయడం నేర్చుకోమన్నారు నాన్నా."

"ఇప్పుడు రాస్తున్నదదేనా?"

"ఔను నాన్నా, ఇంకా పూర్తిఅవలేదు."

"ఎవరికి రాస్తున్నావు?"

"బావకి."

"ఏదీ చదువు."

"ఏమిరా సుందరం! నువ్వు మెడ్రాసెళ్లి అప్పుడే నాలుగు నెల్లెందికదా........."

"అదేమిటే నీ తలకాయి?"

"మీవాళ్లు కనిపిస్తే మీరేం చెప్పదలచుకున్నారో అదేవుత్తరంలో రాయమని మా మేష్టారు చెప్పేరు నాన్నా."

"అందుకని అల్లా రాశేవా?"

"ముందు రాసిందంతా విందూ."

"...నాలుగు నెల్లెందికదా? ఇప్పటికి ఒక్కమాటేనా రాలేదుకదా! నాకు బెంగగావుందనుట్రా! పోనీ వుత్తరం రాసీసాకాని, నాన్న పేరట్టి యింగ్లీ

షుని కాని రాయమనైను. అందులో యేముందో నాకు తెలియదు. నాన్న నడుగుతే యేమీ చెప్పడు. మరి నా కెల్లావుంటుంది? నీకేం. మీ జతకాళ్లతో ఆడుకుంటూ కూచుంటావు. ఇక్కడనే నొక్కత్తినీ యెంత బెంగెట్టుకున్నానో నీ కేం తెలుసును?........."

"ఏడుస్తా వెందుకే?"

"అవునాన్నా, ఒక్కమాటే నారాదు మరి."

"పండుక్కరమ్మని వుత్తరం రాస్తానులే. బెంగెట్టుకోడ మెందుకు, బావ మహారాజులా ఓపరు సీలు పరీక్ష చదువుతుంటేను?"

"మరి నాక్కూడా యింగ్లీషు చెప్పించు నాన్నా."

"ఎందుకు? బావ వుత్తరంరాస్తే చదువుకో డానికా?"

"అసలు నేకూడా యింగ్లీషు చదువుకుంటాను నాన్నా."

"అల్లాగే. ఎల్లుండి మంచిది, యింగ్లీషుబళ్లోకి వేసుదువుగాని. ఇక యీ ఖరిమానేసెయ్యి."

"ఐతే! యిక వుత్తరం రాయను."

"రాయక్కరలేదు. అన్నానికి పొద్దుపోతోంది లే."

౪

"గుడ్ మార్నింగ్ సుందరం. వెన్ డిడ్యు కం?"

"అబ్బో యీ యింగ్లీషెక్కడొచ్చింది?"

"ఎల్లకాలం తెలుగేనేమిటి?"

"ఎవరు చెపుతున్నారు?"

"ఇంగ్లీషుబళ్లోనే?"

"ఐతే యిప్పు డెన్నో క్లాసన్న మాట?"

"ఐతే యిప్పుడు ఫస్టుఫారమన్న మాట."

"మరి నాయింజనీరింగుకోర్సు పూర్తయేసరికి తమకి థరడుఫారమ్ పూర్తవుతుందన్నమాట."

"అవునన్నమాట."

"అప్పుడే యెంతగర్వమొచ్చింది."

"గర్వంకనక నే వుత్తరంరాయకపోవడం."

"ఉత్తరంరాయకపోడం గర్వమా? వుత్తరం వొచ్చిందో లేదో చూసుకోపోవడం గర్వమా?"

"ఎల్లాగైతేం యింగ్లీషొచ్చునుకదా అని యింగ్లీషుని రాయడం గర్వం."

"నాకూ యింగ్లీషొచ్చును సుమా అని చెప్పడం గర్వం కాదూ?"

"పోనీ యీమాటేనా వెళ్లగానే వుత్తరం రాస్తావా?"

"వెళ్లగానే వుత్తరంయెందుకూ? యిరవైరోజుల్లోనే నేవొస్తాను."

"మళ్లీ వొస్తావా?"

"ఎందుకూ?"

"ఎందుకా? నీమెళ్లో..."

"........"

"నీమెళ్లో పుస్తికట్టడానికి."

"నిజమేట్రా?"

"ఏం. నీకు తెలియదేమిటి?"

"మరి ఓపరుసీలుపరీక్ష అయిందాకా పెళ్లిచేసుకోనన్నావు కాదూ?"

"పెళ్లిచేసుకోనన్లేదు, కార్యంచేసుకోనన్నాను."

"ఛీ, అన్నీ యిల్లాంటిమాటలే, అందుకే పెంట్ట బుద్ధి."

"రేపు తలంబ్రాలోసేటప్పుడు పెట్టుతానులే."

"అబ్బాయీ అన్నానికిలే మామయ్య కనిపెట్టుకున్నాడు."

౫

"ఏమండీ అత్తగారూ, మీఅమ్మాయేదీ?"

"రా కాంతం యిల్లాకూచో. ఎప్పుడొచ్చేవు?"

"పొద్దున్న ఏడుగంటల రైలులో వొచ్చేమండి."

"మీ ఆయనకూడా వొచ్చాడా?"

"వొచ్చారు. పండుగ కాదుమరి?"

"ఏంచేస్తున్నాడు?"

"డాక్టరుపరీక్ష ప్యాసయేరు. ఏలూర్లో ప్రాక్టీసు చేస్తున్నారు. మీమందరం యెక్కడుంటున్నారండీ?"

"వాళ్లమామగారూ ఓవరుసీలుపని యిప్పించేరు. ఇక్కడేవుంటున్నాడు."

"ఓవరుసీలుగారి పెళ్లాంకదాఅనేమిటండీ యింటి కొచ్చినా కనపడ్డంలేదు?"

"మొగుడికి కాఫీకాస్తోన్నట్టుంది. చిట్టీ! మేష్టారి కాంతంవొచ్చిందే."

"మరిచిపోయాను మనమడికి పేరేంపెట్టేరండీ అత్తగారూ?"

"వాడే, వాళ్ల నాన్న పేరెట్టేడు."

"శంకరంగారా?"

"ఏమోనమ్మా బుద్ధితక్కువ శంకరయ్యోపోయాను."

"ఎప్పుడొచ్చేవే కాంతం?"

"ఓవరుసీలుగారి పెళ్లానివి. తిక్క శంకరయ్యగారి తల్లివి. నీకు మేం కనిపిస్తామా?"

"కనపడకపోతే మీఆయనచేత కళ్లు ఆపరేషన్ చేయించుకో—"

"మధ్యన నాకళ్లెందుకూ?"

"డాక్టరుగారి పెళ్లానివికనక. పోనీలే. కాస్త టీపుచ్చుకుందుగానిరా."

"ఆకాస్తకోసం నేను లేవడమెందుకూ? ఇల్లాగే తెచ్చిపెట్టు."

"లోపలైతే అంతా కూచోవచ్చునుకదా అని."

"అంతా యెవరు? సుందరంవున్నాడేమిటి?"

"ఊఁ."

"అతన్నికూడా యిల్లాగే రమ్మందూ."

"మేష్టారి కాంతంవొచ్చిందిరా సుందరం."

"కొడుకు తల్లివికూడాను. ఇంకా ఒరేఅనే పిలుస్తావేమిటే చిత్రం."

"లేకపోతే యీవేళ కొత్తగాపిలుస్తానేమిటి?"

"ఓవరుసీలుపనికూడా అయిందైను."

"ఐతే వూడిపడ్డాడా?"

"మీకే శా నాలుగు దివాళ్లెట్టరేం అత్తగారూ?"

"పోనిద్దూ, యెల్లాపిలుస్తేనేమిటి? మేనత్తకొడుకు మేకల్లోకుక్క అన్నారు."